


# కరపత్రం

SINCE 2014

మంగళవారం ఆగస్ట్ 18, 2026 సంపుటి : 2 సంచిక : 307 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

## ఆ ఉగ్ర నెట్‌వర్క్‌ను భూస్థాపితం చేశాం: అమిత్ షా



2లో

## బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వకుండా ఆ చట్టం అడ్డుకోగలదా ? - సుప్రీంకోర్టు

అణు విద్యుత్ కేంద్రంలో ప్రమాదం జరిగి ప్రజలకు నష్టం జరిగితే.. పరిహారం ఇప్పించే అధికారం కోర్టులకు ఉంటుందా? లేదా కొత్త అణు చట్టంలోని పరిమితులే వర్తిస్తాయా? అని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రమాదం జరిగినప్పుడు సంబంధిత సంస్థ చెల్లించాల్సిన పరిహారాన్ని రూ.3,000 కోట్లకు పరిమితం చేయడంపై దాఖలైన పిటిషన్‌ను సోమవారం ధర్మాసనం విచారించింది.



2లో

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు..

### రాహుల్ గాంధీకి ఊరట

- రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట
- ఈడీ, సీబీఐ నివేదిక సమర్పణకు బ్రేక్



2లో

# ప్రభుత్వ వైద్యులు అదనపు సేవలందిస్తే ప్రోత్సాహకాలు: సీఎం రేవంత్

- అదనపు సేవలందిస్తే ప్రోత్సాహకాలు: సీఎం రేవంత్
- విద్య, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం
- ఆరోగ్యశ్రీ కింద రూ.2,700 కోట్లు చెల్లించాం
- పేదలకు ఉచిత వైద్యం, ఆహారం, వసతి
- 2027 డిసెంబర్‌లోపు 4 ఆస్పత్రుల పూర్తి
- ఆరు నెలలకు ఒక ఆస్పత్రి ప్రారంభం
- ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ తరహాలో నిర్వహిస్తాం



హైదరాబాద్: విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యాంశాలుగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి (=వఝుత్ష్ర =వసఎఎ) అన్నారు. విద్య, వైద్యంపై చేసే వ్యయాన్ని పెట్టుబడిగా భావిస్తున్నామని చెప్పారు. సనత్‌నగర్‌లో మర్రిచెన్నారెడ్డి టిమ్స్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.

“ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. ప్రతి పేదవాడికీ ఉచిత వైద్యం అందిస్తున్నాం. మా పాలనలో ఆరోగ్య శ్రీ కింద రూ.2,700 కోట్లు చెల్లించాం. రోగులతో పాటు ఆస్పత్రికి వచ్చే బంధువులకు ఆహారం, వసతి సౌకర్యం కల్పిస్తున్నాం. పేదలకు విశ్వాసం కలిగిస్తే మన జన్మ సార్థకం అయినట్లే. మన నర్సింగ్ స్టాఫ్‌పై జర్మనీ, జపాన్, దక్షిణకొరియా దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయి.

2027 డిసెంబర్ 9లోపు ఉస్మానియా, ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ ఆస్పత్రులను పూర్తిచేస్తాం. ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభిస్తాం. కార్పొరేట్ ఆస్పత్రుల్లాగే వీటిని నిర్వహిస్తాం. రోగులకు 70 శాతం నర్సింగ్ సిబ్బంది, మిగతా 30 శాతం వైద్యులు సేవలు అందిస్తారు. ఆరోగ్యశ్రీ కింద ప్రైవేట్‌లో ఎక్కువ నిధులు ఇస్తున్నాం. ప్రభుత్వ వైద్యులు ఆస్పత్రుల్లో అదనపు సేవలు అందిస్తే ప్రోత్సాహకాలు ఇస్తాం. కష్టం వస్తేనే సంక్షేమ పథకాలు ఉచితంగా పొందాలని అనుకుంటారు. గౌరవంగా బతకాలి, కష్టపడాలి అని ప్రజలు కోరుకుంటారు. సంక్షేమ పథకాలు తగ్గించాలంటే ప్రజలు స్వతంత్రంగా బతికేలా అవకాశాలు కల్పించాలి” అని రేవంత్ అన్నారు.



## ఆగస్టు 30 నుంచి కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమం

తిరుమల: రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు కారీరిష్టి యాగం (వరుణ యాగం), వరుణజపం, పర్జన్యశాంతి (ఇంద్ర యాగం) హోమాలను తితిదే నిర్వహించనుంది. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 32 మంది వేద, శ్రౌత, స్మార్తపండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సెప్టెంబర్ 3న మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. ధర్మగిరి వేద విజ్ఞన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను బంద్ చేయాలనే కుట్ర

మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



2లో

## 22ఏ అప్‌డేట్‌లో పొరపాటు..

### అధికారుల తరపున సారీ: మంత్రి పొంగులేటి



- ప్రైవేటు ఆస్తులకు ఆటంకం కలిగించాలనే ఉద్దేశం లేదు
- నాలుగు జిల్లాల నుంచి 750 దరఖాస్తులు
- నిషేధిత జాబితా అప్‌డేట్‌లో పొరపాటు
- ప్రైవేట్ ఆస్తులను 22ఏ నుంచి త్వరలో తొలగిస్తాం
- ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ: 18005994788
- భూములు సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందొద్దు

2లో

## డీఎస్సీపై మాట్లాడే అర్హత వైకాపాకు లేదు

### మంత్రి అచ్చెన్నాయుడు

- నిరుద్యోగులను మోసం చేసింది బొత్స కాదా?
- డీఎస్సీపై 300 కోర్టు కేసులు వేశారు
- ఆధారాలతో సమాధానం చెప్పేందుకు సిద్ధం
- యువత భవిష్యత్తుతో రాజకీయం చేయొద్దు



2లో

## అమరావతి పనులు వేగవంతం

- మంత్రి పొంగూరు నారాయణ
- 97 ప్రాజెక్టుల పనులు ప్రారంభం
- రూ.41,187 కోట్ల రుణం సమీకరణ
- రైతులకు 71,299 రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు
- 29 గ్రామాల్లో రూ.904 కోట్లతో మౌలిక వసతులు



2లో

## ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- త్వరలో ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు
- ఆటో కార్మిక సంఘాలు విజ్ఞప్తి మేరకు ఆటో ఛార్జీల పెంపుపై ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది



2లో

# ఏఈ కుటుంబం ఆత్మహత్యాయత్నం..

### బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: పవన్



- ఘటనపై పవన్ కల్యాణ్ విచారం
- గల్లంతైన వారి కోసం ముమ్మర గాలింపు
- అవసరమైతే ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సేవలు
- ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశం
- బాధ్యులుగా తేలితే కఠిన చర్యలు
- బాధిత కుటుంబానికి అవసరమైన వైద్య సాయం
- సమస్యలకు పరిష్కారం ఉంటుందని పవన్ సూచన

పిఠాపురం : రాజమహేంద్రవరం సమీపంలో పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ నూకరాజు కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. గల్లంతైన వారిని గుర్తించి, రక్షించేందుకు యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. అవసరమైతే ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల సేవలను వినియోగించాలని సూచించారు. ఈ ఘటనకు సంబంధించి తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడారు. ఏఈ కుటుంబంతో సహా ఆత్మహత్యాయత్నానికి దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, ఇందులో ఎవరైనా బాధ్యులుగా తేలితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటన నుంచి బయటపడిన నూకరాజు మనుమడి ఆరోగ్య పరిస్థితి వివరాలను కూడా పవన్ అడిగి తెలుసుకున్నారు.

2లో

# సంపాదకీయం

## బహుళార్థక రంగస్థల కవిత 'నీలవేణి'



"ఈ పిచ్చి ప్రపంచం లాగే నువ్వు కూడా ఎందుకురా ఈ ప్రేగులెముకల దేహం కోసం మరణిస్తావు?"..."మీరంతా కళ్ళు ఉన్న గుడ్డివాళ్ళు. అందుకే ఇంత హింస, ఇన్ని అత్యాచారాలు జరుగుతున్నా సబ్ ఠీక్ హై అంటున్నారు. మేం చూడగలిగే గుడ్డి వాళ్ళం"..."మేం చేస్తే నేరం. మీరు చేస్తే చట్టబద్ధం, మేం చేస్తే కామం, మీరు చేస్తే శృంగారం"... ఇలాంటివి మరెన్నో తాత్విక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సంఘర్షణలను అత్యంత కళాత్మకంగా, యిప్పటివరకు ఏ తెలుగు నాటకమూ ప్రదర్శించని విధంగా, ఒక మహా అద్భుత ఇంద్రజాల ప్రదర్శన లాగా తన జనపదం నాటక రిపర్టరీ ద్వారా, తాను రచన చేసి, పరికల్పన, దర్శకత్వం చేసి 'నీలవేణి' నాటకాన్ని ఇటీవల రవీంద్ర భారతిలో ప్రదర్శించాడు శ్రీనివాస్ దెంచనాల. ప్రాథమిక ప్లాట్ కోసం గొల్లపూడి మారుతీరావు నాటకం 'కళ్ళు'ను వాడుకున్నాను అని చెప్పాడు.

'నీలవేణి' సాంఘిక, పౌరాణిక, తాత్విక, శాస్త్రీయ, జానపద లక్షణాల సంయోగం. ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసి కొడిగట్టుతున్న నాటకపు దీపాన్ని దేదీప్యమానం చేసింది. మసక చీకటి నేపథ్యంలో నీలిరంగు దీపాల కాంతిలో రంగస్థలం మీద ఆరంభమై ప్రేక్షకుల ఉత్సుకతను తారాస్థాయికి తీసుకుపోయింది. కాంతులు విరజిమ్మే కనకదుర్గ విగ్రహం ముందు కళాకారుల గానం, నృత్యం కనకదుర్గామాతను ఆవాహన చేస్తూ సాగే అభినయం శాస్త్రీయ సంస్కృత నాటకపు 'నాంది' 'ప్రస్తావన'లను తలపింపచేసింది. విగ్రహం నుండి కనక దుర్గ ప్రత్యక్షం అవడం ఒక కన్నుల పండగ. ఆరంభంలోను అంతిమ దృశ్యంలోను నీలవేణి రంగడిని చంపవద్దని వారించినప్పుడు, దేవత మానవులతో కలిసి సంభాషించడం, అదీ సామాజిక న్యాయం కోసం, ఇది తెలుగు నాటకరంగంలో అపూర్వ ఘట్టం.

ఒక వృద్ధ అంధ భిక్షకుడు చీకట్లో నడిచేవారిని జాగ్రత్తగా వెలుగువైపు నడవాలని పదే పదే హెచ్చరిక చేయడాన్ని దర్శ కుడు సంగీతంలోని తీవటతీఘుఅఅ లాగా వాడుకొని భౌతిక, స్థానిక, తాత్విక స్థాయిని, యూనివర్సల్ స్థాయిని దాటించి ఒక మార్మిక స్థాయికి తీసుకుపోతాడు ప్రేక్షకుడిని. ప్రతీ దృశ్యమూ ఒక కవితా ఖండికను చూసిన అనుభూతిని అందిస్తుంది. ఈ నాటకంలోని మౌలిక అంశం మనసుకూ, శరీరానికీ మధ్య సంఘర్షణే అయినప్పటికీ, దేహం అశాశ్వతతత్వాన్ని వివరించి, మహా ఆశ్చర్యంగా నాయకుడు (ఆలం సందీప్) క్లైమాక్స్‌లో కళ్ళల్లో త్రిశూలాన్ని దించుకున్నాక పారడాక్సికల్‌గా ప్రఖ్యాత గాయకుడు జంగిరెడ్డి గొంతుతో నేపథ్యంలో "నీ రక్త మాంసపు ప్రేగులెముకల దేహమును జూసే ప్రేమిస్తినీ" అని వినడం లోని రసానుభూతిని నాటకాన్ని చూసి మాత్రమే పొందగలం. ప్రేమకీ--కామానికీ, స్వేచ్ఛకూ--కట్టుబాటుతనానికీ, గ్రామానికీ--నగరానికీ, విలువలకూ--కెరీరిజంకూ ఉన్న సంఘర్షణనూ అనివార్య బంధాన్నీ ఏక స్థల కాల సందర్భంలో చూపించడం దర్శకుడి ఊహా నైపుణ్యానికి నిదర్శనం. నాటక కథ సాధారణమైనదే అనిపించినా దర్శకుడి తిరుగుబాటు ధోరణి చాలామందిని రస వ్యాకులతకు గురిచేస్తుంది. ప్రదర్శనశైలిలోని ప్రాచీన సంస్కృత, జానపద, ఆధునిక సంప్రదాయాల మేళవింపు, వస్తువులోని బహుళ వస్తువులు మన తెలుగు నాటకానికి ఒక అసాధారణమైన ఆధునికానంతరతను ఇస్తున్నాయి.

అయిదుగురు అంధ భిక్షకులు హైదరాబాద్ నగర పొలిమేరల్లో శిథిల కనకదుర్గ గుడి పక్కన నివసిస్తూ రకరకాల మోసాలకు గురవుతుంటారు. నాటకంలో మొదటి మలుపు గుడ్డివాళ్ళకు చూపు తెప్పించే డాక్టర్ పక్క ఊరికి రావడం. ఆ గుడ్డివాళ్ళందరూ తమలో యువకుడైన రంగడి మీద పూర్తి విశ్వాసంతో తాము కూడబెట్టుకున్న డబ్బుతో అతనికి శస్త్రచికిత్స చేయిస్తారు. కానీ చూపు వచ్చిన రంగడి మనస్తత్వంలో విపరీతమైన మార్పు వస్తుంది. అది అతన్ని ప్రేమించిన నీలవేణి (మామిడి శ్రీలక్ష్మి)తో సహా అందరినీ దుఃఖాగ్రహానికి గురిచేస్తుంది. చూపు వచ్చిన రంగడు తను జీవించిన పరిసరాలను అసహ్యించుకొని, వాళ్ళను వదిలేసి తన దారి తాను చూసుకొని వెళ్ళిపోయినాక కూడా, నీలవేణితో ఉన్న ప్రేమ, శృంగార సంబంధాలను తెంపుకోలేకపోతాడు. అటు డబ్బు మీది వ్యామోహంతో తనను నమ్ముకున్న గుడ్డివాళ్ళను మోసం చేసి, వాళ్ళచేతనే భిక్షాటన చేయించి, కళ్ళున్న వాళ్ళను గుడ్డివాళ్ళుగా నటింపజేసి వాళ్ళ చేతనే డబ్బు సంపాదించే వ్యాపారం చేసి, రంగడు ఎమ్మెల్యేగా ఎన్నికవుతాడు. ఎంత సంపాదించినా, గొప్ప పదవిని దక్కించుకున్నా, నీలవేణి పట్ల అతనికి ఉన్న కోరిక, ప్రేమ అతన్ని విచక్షణా జ్ఞానం కోల్పోయేట్టు చేసి ఆమెను బలవంతంగా ఎత్తుకెళ్ళి పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. ఆమె చేత నిరాకరింపబడతాడు. అతని మీద నమ్మకం పోయిందని, అతను ఇదివరకటి రంగడు కాదని నీలవేణి తేల్చిచెప్పినా వినకుండా మీదకు వస్తుంటే, ఆమె ఆగ్రహించి కనకదుర్గా మాత త్రిశూలంతో అతని కళ్ళు పీకేయబోతుంది. దుర్గ ప్రత్యక్షమై చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని ప్రజల అభిప్రాయం అడుగుతుంది. ప్రజలు వాడి వాదన వినకుండానే వాణ్ని ఎన్‌కౌంటర్ చేయాలి అనడం ద్వారా మన సంఘంలోని మాస్ హిస్టీరియా బట్టలు విప్పుతాడు దర్శకుడు. తల్లి ఆదేశం ప్రకారం నీలవేణి రంగణ్ణి క్షమించి వెళ్ళిపొమ్మంటే, నీలవేణి మీది కోరికను, ప్రేమను చంపుకోలేని రంగడు తీవ్ర మానసిక సంఘర్షణలో తన కళ్ళు తానే పొడుచుకుంటాడు. మళ్లీ గుడ్డివాడై తన అంధ భిక్షక గుంపులో కలిసిపోతాడు. చీకటిలో నడిచేవారు జాగ్రత్తగా వెలుగువైపు నడవాలని చేసే నాటకారంభ హెచ్చరికతో నాటకం ముగుస్తుంది. క్లైమాక్స్‌లో షేక్స్పియర్ వంటి వారు వాడిన సొలిలాక్వీ (ఆత్మభాషణం)ని వాడడం, అది కూడా శ్రీశ్రీ కవితను పునర్నిర్మించి వాడడం, ఒక అద్భుతం. పతాక సన్నివేశం ప్రఖ్యాత గ్రీకు విషాదాంత నాటకకర్త సొఫోక్లిస్ రాసిన 'ఈడిపస్ రెక్స్' నాటకంలోని అపరాధ భావ సంఘర్షణతో ఈడిపస్ తన కళ్ళు తానే పొడుచుకుని గుడ్డివాడు అవడాన్ని గుర్తుకు తెచ్చింది.

ఈ నాటకం భారతీయ సంస్కృత, జానపద కథాగాన శైలినీ, నృత్యరూపక శిల్పాన్ని మిశ్రమించుకున్న ఒక సరికొత్త ఆధునికానంతర నాటక శైలిని సృష్టిస్తుంది. ప్రేక్షకుడిని దుఃఖ, బీభత్స రసాత్మకంగా రంజింప చేస్తుంది. పౌరాణిక, తాత్విక లక్షణాలతో పాటు సామాజిక, వ్యక్తిగత సంఘర్షణను, రాజకీయ దృక్కోణాన్ని కళాత్మకంగా ప్రదర్శించడం కోసం దర్శకుడు కర్ణాటక యక్షగానన్నీ, తెలంగాణ జానపద రీతుల్ని, నిర్వచనంలో ఇమడని మనిషి ఎత్తు కనకదుర్గ విగ్రహాన్నీ, అద్భుత కాంతివిన్యాస వైభవాన్నీ, కవితాత్మక--ప్రతీకాత్మక--చిత్రాత్మక రసమయ సంభాషణలనూ వాడుకున్నాడు. కళ్ళు వచ్చిన రంగడు తన అంధ ప్రేయసికి ప్రకృతి సౌందర్యం చూపించే దృశ్యంలో వేదికపై చంద్రుడినీ, నదినీ, పూలతోటను ఒకేసారి సృష్టించడం నాటకానికి తలమానికం. ఇక్కడ దేవులపల్లిని వాడుకోవడం అపురూపం. కనకదుర్గకు కర్ణాటక యక్షగాన దుస్తులు, ఆహార్యం, ఛండే దరువులకు నాట్యం, ఫైబర్ దుర్గ మాయమై నటి దుర్గ ప్రత్యక్షమవడం మనకు మహానుభూతి. ఈ నాటకం శ్రీనివాస్ దెంచనాలను మరొక్కసారి జాతీయస్థాయి దర్శకుడిగా నిలబెట్టింది. ఈ నాటకంలోని ప్రయోగాలు భవిష్యత్తు ప్రయోక్తలకు, నాటక రచయితలకు, ప్రయోగకర్తలకు మార్గదర్శకంగా ఉంటాయి. అటు ఆధునికానంతర కవిత్వంలోనూ, ఇటు నాటక రంగంలోను నలభై రెండేళ్ళుగా కృషి చేస్తున్న దెంచనాలకు ఈ రెండు తప్ప వేరే ప్రపంచాలు లేవు.

## డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు

154 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించి, మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో ఫలితాలను వెల్లడించామని, అభ్యర్థుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కమిటీలు కూడా ఏర్పాటు చేశామని చెప్పారు.

**ఎలాంటి లోపాలు లేవు**

నోటిఫికేషన్‌లో గానీ, నియామకాల్లో గానీ ఎలాంటి లోపాలు లేవని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కొందరు ఉద్దేశపూర్వకంగా కోర్టు కేసులు వేసి అడ్డంకులు సృష్టించారని, కూలీలతో ఫేక్ ప్రదర్శనలు చేయిస్తూ అభ్యర్థుల ప్రతిభను కించపరుస్తున్నారని, దీనిపై ఉపాధ్యాయులే స్వయంగా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు.

**అసెంబ్లీ చర్చకు సవాల్**

ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు మాత్రమే జవాబుదారీగా ఉంటుందని స్పష్టం చేశారు. డీఎస్సీ అంశంపై చర్చించే ధైర్యం ఉంటే సభకు రావాలని, అసెంబ్లీలో వాస్తవాలు మాట్లాడకుండా బయట అనవసర వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు.

**జవాబుదారీతనమే ప్రాధాన్యం**

ప్రజల పట్ల పూర్తి బాధ్యతతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, భవిష్యత్తులోనూ విద్యా విధానంలో మరింత పారదర్శకత తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## డీఎస్సీపై మాట్లాడే అర్హత

# వైకాపాకు లేదు

**అమరావతి, ఆగష్టు 17 :**

ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ పేరుతో ఆశలు చూపి మోసం చేసిన వైకాపాకు, బొత్స సత్యనారాయణకు డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. శాసనమండలిలో బొత్స చేసిన వ్యాఖ్యలకు ఆయన బదులిచ్చారు.

**కోర్టు కేసులతో అడ్డంకులు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు చేపడితే, ఆ ప్రక్రియను అడ్డుకునేందుకు వైకాపా 300 కేసులు వేసిందని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగాలు ఇవ్వకుండా, ఇప్పుడు ఉద్యోగాలు ఇస్తుంటే అడ్డుకోవడం వారి ద్వంద్వ వైఖరిని చూపుతోందని తెలిపారు.

**చర్చకు సిద్ధం**

డీఎస్సీపై శాసనమండలిలో ఎప్పుడైనా సమగ్ర చర్చకు సిద్ధమని, వైకాపా పాలనలోని నిర్వాకాలపై బుక్‌లెట్ ఇస్తామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను కించపరచవద్దని, నిరుద్యోగుల భవిష్యత్తుతో రాజకీయం చేయడం మానుకోవాలని తెలిపారు.

## అమరావతి పనులు వేగవంతం

**అమరావతి, ఆగష్టు 17 :**

అమరావతి రాజధానిలో 119 ప్రధాన మౌలిక వసతుల ప్రాజెక్టులకు గాను 97 పనులు ప్రారంభమయ్యాయని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. వివిధ ఆర్థిక సంస్థల ద్వారా రూ.41,187.70 కోట్ల రుణాలు సమీకరించామని పేర్కొన్నారు.

**ప్లాట్ల కేటాయింపు పూర్తి**

ల్యాండ్ పూలింగ్ కింద 30,173 మంది రైతులకు 71,299 రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు 98 శాతం పూర్తయిందని, వాటి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. రైతులకు ఇప్పటివరకు రూ.2,248.02 కోట్ల కౌలు చెల్లించినట్లు మంత్రి వివరించారు.

**గ్రామాల్లో మౌలిక వసతులు**

రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో రూ.904 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి పనులు చేపడుతున్నామని, ఆగస్టు 27న టెండర్లు ఖరారు చేస్తామని తెలిపారు. ఆర్‌అండ్‌బీ రోడ్ల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

## 22ఏ అప్‌డేట్‌లో పొరపాటు..

హైదరాబాద్: ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 అప్లికేషన్లు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడారు. "22ఏ భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగింది. అధికారుల తరఫున క్షమాపణలు కోరుతున్నాం. ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దు" అని పొంగులేటి అన్నారు.

## ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

2026: మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ ను తెలంగాణ కేకేసీ యూనియన్ ప్రతినిధులు కలిసి ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యలను ఇప్పటికే కేబినెట్‌లో చర్చించామని తెలిపారు. త్వరలోనే రవాణా శాఖ తరఫున కార్మిక శాఖతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆటో కార్మికుల సంక్షేమం కోసం హామీ ఇచ్చిన విధంగా వీలైనంత త్వరలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

ఆటో ఛార్జీల పెంపుపై పరిశీలన

ఆటో ఛార్జీలను పెంచాలని ఆటో కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయని మంత్రి తెలిపారు. 2012లో ఆటో ఛార్జీలు పెరిగాయని, దాదాపు 14 సంవత్సరాలుగా ఛార్జీల పెంపు జరగలేదన్నారు. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు వాహనాల ధరలు, నిర్వహణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఆటో కార్మికుల ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు.

అయితే ప్రయాణికులపై అదనపు భారం పడకుండా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆటో ఛార్జీల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు.

ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఆటోలపై దుష్ప్రచారం చేయొద్దు

ఆర్టీసీ తరఫున ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసి ఆర్టీసీనే ఆటోలు నడుపుతుందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

ఆటో కార్మికుల ఉపాధిని దెబ్బతీసేలా ఆర్టీసీకి ఎలాంటి ఆలోచన లేదని తేల్చి చెప్పారు. ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేయదని స్పష్టంగా పేర్కొన్నారు.లాస్ట్ మైల్ కనెక్టివిటీపై దృష్టిలాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ, రైల్వే, మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థలను పరస్పరం అనుసంధానం చేసి ప్రయాణికులకు ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి తిరిగి ఇంటికి చేరే వరకు సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.ఆర్టీసీ రైళ్లు కొనుగోలు చేయదని, రైల్వే సంస్థలు ఆటోలు కొనుగోలు చేయవని, అదే విధంగా ఆర్టీసీ కూడా ఆటోల కొనుగోలుకు వెళ్లదని మంత్రి స్పష్టం చేశారు.డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు రూ.1.50 లక్షల సాయం

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు..

మొదటిపేజీ తరువాయి

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కి ఊరట లభించింది. ఈ కేసులో నివేదికను అలహాబాద్ హైకోర్టులో సమర్పించొద్దని ఈడీ, సీబీఐలకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై తదుపరి విచారణ జరిగేవరకు ముందుకు తీసుకువెళ్లొద్దని అలహాబాద్ హైకోర్టుకు సూచించింది. ఆగస్టు 20న జరగాల్సిన విచారణను వాయిదా వేయాలని ఆదేశించింది. ఈ విషయం అంత తీవ్రమైనదైతే.. ఇన్నాళ్లూ దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనం వహించాయని ప్రశ్నించింది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన భాజపా నేత దర్యాప్తు సంస్థలకు చేసిన ఫిర్యాదుపై గతంలో అలహాబాద్ హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేసి, నివేదిక సమర్పించాలని ఈడీ, సీబీఐలను ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ.. రాహుల్ గాంధీ సుప్రీం కోర్టు (ాబజూతీవఎవ జశీబతీ)ను ఆశ్రయించారు. కేసును దిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను వాయిదా వేయాలని ఆదేశించింది.

## బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వకుండా ఆ చట్టం అడ్డుకోగలదా ? - సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి

ఐఏఎస్ మాజీ అధికారి ఈఏఎస్ శర్మ నేతృత్వంలోని ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు ఈ చట్టాన్ని సవాల్ చేశారు.

అణు ప్రమాదం జరిగితే బాధ్యత వహించే సంస్థలపై పరిమితుల (శాంతి చట్టం ద్వారా) వల్ల.. భద్రత విషయంలో నిర్లక్ష్యానికి అవకాశం ఉంటుందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. వాదనలు విన్న చీఫ్ జస్టిస్ (జష్ట్రఅవట జీబర్‌అఎవ) సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం.. "ప్రమాద బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశించకుండా ఆ చట్టం అడ్డుకోగలదా?" అని కేంద్రాన్ని ప్రశ్నించింది. ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించి అణు విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకే ఈ పరిమితిని విధించినట్లు అభిప్రాయపడింది. అణు ప్లాంట్ల పర్యవేక్షణ సంస్థ నియామకాల్లో పారదర్శకతపై కూడా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నియంత్రణ సంస్థ సభ్యుల నియామకంలో ప్రయోజనాల సంఘర్షణ (జశీఅటశ్రీఱష్ శీట ×త్‌వతీవర్) ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కీలక అంశాలపై తదుపరి విచారణలో కేంద్రం ఇచ్చే వివరణపై స్పష్టత రావాల్సి ఉంది. అణు రియాక్టర్లకు సంబంధించి 'సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ' (శాంతి) చట్టం-2025 ముసాయిదా నిబంధనలను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన సంగతి తెలిసిందే.

## ఆ ఉగ్ర నెట్‌వర్క్‌ను భూస్థాపితం చేశాం: అమిత్ షా

మొదటిపేజీ తరువాయి

ఐఎస్ఐ మద్దతు కలిగిన షహజాద్ భట్టీ నెట్‌వర్క్ అనే ఉగ్రవాద గ్రూప్‌ను నాశనం చేసినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే.. ఆ గ్రూప్‌నకు చెందిన 200 మందికిపైగా సభ్యుల్ని అరెస్టు చేసినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తద్వారా దాని విధ్వంసకర దాడుల ప్రణాళికలను భగ్నం చేసినట్లు తెలిపారు. ఉగ్రవాదం విషయంలో భారత్ కఠిన వైఖరికి ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు.

"షహజాద్ భట్టీ నెట్‌వర్క్‌కు అనేక ఉగ్ర కార్యకలాపాల్లో ప్రమేయం ఉంది. ఈ క్రమంలోనే భారత భద్రతా దళాలు ఇటీవల 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో సమన్వయంతో కూడిన ఆపరేషన్‌లు నిర్వహించాయి. 200 మందికిపైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేసి.. భట్టీ నెట్‌వర్క్‌ను నాశనం చేశాయి. ఐఎస్ఐ నిధులతో నడిచే ఈ గ్రూప్ నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆయుధ ఫ్యాక్టరీ గుర్తులున్న గ్రెనేడ్లు, పిస్టళ్లు, తూటాలు, గూఢచర్యం కోసం ఉపయోగించిన సీసీటీవీ కెమెరాలు సహా పెద్దఎత్తున సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి" అని అమిత్ షా తెలిపారు.

ఇదిలా ఉండగా.. గత నెలలో మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) రాష్ట్రవ్యాప్తంగా ఓ భారీ ఆపరేషన్‌ను చేపట్టింది. ఇందులో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టీతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై 112 మందిని అధికారులు ప్రశ్నించారు. గ్యాంగ్‌స్టర్ భట్టీ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా దేశ వ్యతిరేక కార్యకలాపాల వైపు యువతను ఆకర్షించడానికి, వారిని ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఏటీఎస్ అధికారి ఒకరు తెలిపారు.

ప్రభుత్వ వివరాల ప్రకారం.. షహజాద్ భట్టీ నెట్‌వర్క్ (ాదీచీ) అనేది పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక ఉగ్రవాద గ్రూప్. భారత్‌లో పలు బాంబు దాడులు, హత్యల వెనుక దీని హస్తం ఉంది. పోలీస్, రక్షణ, మతపరమైన ప్రదేశాలను రెక్కీ చేసేందుకు, గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు స్థానిక మధ్యవర్తులకు డబ్బు చెల్లిస్తోంది. భట్టీపై ఎన్ఐఏ పలు కేసులను దర్యాప్తు చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో అతడిని పరారీలో ఉన్న నిందితుడిగా పేర్కొంటూ ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసింది.

## ఏఈ కుటుంబం

# ఆత్మహత్యాయత్నం..

బాలుడికి అవసరమైన వైద్య సాయం అందించి పూర్తి స్థాయిలో కోలుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సమస్యకు పరిష్కార మార్గం ఉంటుందని, క్షణికావేశం, మానసిక ఒత్తిడికిలోనై ఎవరూ ప్రాణాలు తీసుకునే నిర్ణయాలు తీసుకోవద్దని పవన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బెదిరింపులు, వేధింపులు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు తక్షణమే పోలీసులు, సంబంధిత అధికారులను సంప్రదించి చట్టపరమైన సహాయం పొందాలన్నారు. ప్రాణం అమూల్యమైందని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను బంద్ చేయాలనే కుట్ర

మీ తప్పులకు ప్రభుత్వ అధికారులు బలి కావాలా?

తప్పు మీరు చేస్తే శిక్ష వారు అనుభవించాలా?

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను బంద్ చేయాలనే కుట్ర బయటపడటంతో ఆ తప్పును అధికారులపైకి నెట్టే ప్రయత్నం మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్నారు.22ఏ నిషేధిత భూముల విషయంలో భూదందా వెలుగులోకి రావడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి "సారీ" అంటూ తప్పించుకుని, అధికారులపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారనీ ధ్వజమెత్తారు ప్రజల జీవితాలతో ముడి పడి ఉన్న అంశాల్లో సరిదిద్దుకోలేని తప్పు చేసి, "సారీ" చెప్పి తప్పించుకుంటే సరిపోదు రేవంత్ రెడ్డికళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఇక రావేమోనని పేదలు ఆందోళన చెందుతున్నారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంతో ఎంతోమంది మానసిక వేదనకు గురయ్యారనీ

బాధ్యులైన అధికారులపై మీరు చర్యలు తీసుకోవడం కాదు.. మీ నిర్లక్ష్యం, మీ ప్రభుత్వ వైఫల్యంపై ముందు చర్యలు తీసుకోవాలి.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఆగస్ట్ 18, 2026

## ప్రిన్సిపాల్ వెంకయ్య కు ఘన సన్మానం




**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్య 2026 విద్యా సంవత్సరంలో ఉత్తమ సేవలు అందించిన నేపథ్యంలో భారత స్వాతంత్ర దినోత్సవం రోజున తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ చేతుల మీదుగా ఉత్తమ ప్రిన్సిపాల్ గా ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల బోధన మరియు బోధనేతర సిబ్బంది తదితరులు సోమవారం రోజున ఆ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్యను శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు.

## మెట్‌పల్లిలో ఘనంగా "నాగుల చవితి" వేడుకలు



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

మెట్‌పల్లి పట్టణంలో సోమవారం నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మెట్‌పల్లి పట్టణంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే పలు ఆలయాలు భక్తులతో ఆలయాల వద్ద భక్తుల రద్దీ నేపథ్యంలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పండుగ సందర్భంగా పట్టణంలోఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పట్టణంలోని శివాలయం ఖాదీ కాంప్లెక్స్ లోని ఆంజనేయ స్వామి దేవాలయం అలాగే పెద్దమ్మ దేవాలయం భక్తులతో సందడిగా మారాయి. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని నాగదేవతకు పూజలు నిర్వహించి పాలు, పసుపు, కుంకుమ లతో ప్రత్యేక పూజలు చేశారు.

## కోరుట్ల డిగ్రీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్రవేశ దరఖాస్తుల పొడిగింపు

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**



ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోరుట్లలోని డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ద్వారా 2026--27 విద్యా సంవత్సరానికి బి. ఏ. , బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డా. అడ్లగట్ల లక్ష్మణ్ తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రవేశ దరఖాస్తుల గడువును సెప్టెంబర్ 9 వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. కోరుట్ల పట్టణంతో పాటు పరిసర గ్రామాల విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఉన్నత విద్యను కొనసాగించాలనుకునే వారికి ఇది మంచి అవకాశమని తెలిపారు. ప్రవేశాలు, కోర్సులు, దరఖాస్తు విధానం తదితర వివరాల కోసం స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డా. అడ్లగట్ల లక్ష్మణ్ ను 9989738117లో సంప్రదించాలని సూచించారు.

## స్కానింగ్ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ తప్పనిసరి: డాక్టర్ రజిత

**కరపత్రం ప్రతినిది హనుమకొండ, ఆగస్టు 17**

లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం ప్రకారం స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు అన్ని రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని, స్కానింగ్‌కు వచ్చే ప్రతి గర్భిణీ పూర్తి వివరాలను ఫామ్-ఎఫ్‌లో నమోదు చేయాలని మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రజిత సూచించారు.హనుమకొండ, పరకాల ప్రాంతాల్లోని స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆమె రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపులు, స్కానింగ్ నివేదికలు, రిఫర్ చేసిన వైద్యుల వివరాలు, ఇతర రికార్డులను పరిశీలించారు. ప్రతిరోజూ ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.పిండం ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడం, లోపాలను గుర్తించడం కోసం మాత్రమే స్కానింగ్‌ను ఉపయోగించాలని, పుట్టబోయే శిశువు ఆడా, మగా అనే విషయాన్ని వెల్లడించడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారని తెలిపారు.లింగ నిర్ధారణకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారం అందించిన వారికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.50 వేల నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. ఇందుకోసం 6300030940 ఫిర్యాదు నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం శాయంపేట, కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి మాతా-శిశు సంక్షేమానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ సాయి కృష్ణ, హెల్త్ సూపర్వైజర్లు పద్మజ, సందీప్ పాల్గొన్నారు.



# కోరుట్లలో క్యాంపు భూమి కబ్జా

**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

కోరుట్ల పట్టణంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ నిషేధిత 22ఏ జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల సహాయంతో రిజిస్ట్రేషన్ చేసుకుని దర్జాగా కబ్జాకు పాల్పడుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- **కోరుట్ల పట్టణంలోని సర్వే నంబర్ 295లో ఉన్న 0.21 గుంటల భూమి ఎస్సారెస్పీకి సంబంధించిన ప్రభుత్వ భూమి అని తెలుస్తోంది. ఈ భూమిని కొందరు కబ్జా చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.**




కోరుట్లలోని సర్వే నంబర్ 295లో 1 ఎకరం 14 గుంటల భూమి ఉండగా, ఇందులో 0.21 గుంటల భూమిని ఎస్సారెస్పీ కోసం భూసేకరణ ద్వారా సేకరించారు. ఈ భూమికి భూసేకరణ అవార్డు కాపీ కూడా ఉండటం గమనార్హం.

అయితే కొందరు ఈ 21 గుంటల ఎస్సారెస్పీకి చెందిన ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని చుట్టూ కంపౌండ్ వాల్ నిర్మించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

- **ఎస్సారెస్పీ భూమిలో అక్రమ నిర్మాణం?**

కోరుట్లకు చెందిన మహమ్మద్ ఆమేర్ ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, కోరుట్ల ఆర్డీవో, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ నిషేధిత 22ఏ జాబితాలోని భూములను రెవెన్యూ అధికారులే కాపాడాల్సి ఉండగా, జిల్లాలోని రెవెన్యూ అధికారులందరికీ ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం ఆందోళనకరంగా ఉందని ఫిర్యాదుదారుడు పేర్కొంటున్నారు.

నిషేధిత 22ఏ జాబితాలో ఉన్న 0.21 గుంటల భూమి ప్రభుత్వానికి సంబంధించినదని, వెంటనే ఆ భూమిని కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసిన వారిపై, అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# భారతదేశంలో తొలిసారిగా ప్రపంచ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్

- **ఈ నెల 21 నుంచి 23 వరకు గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో పోటీలు**

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, ఆగస్టు 17**

భారతదేశంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక ప్రపంచ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కు ఘన ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహించనున్నట్లు జూబ్లీహిల్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

జేఆర్ ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ, అమికల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఛాంపియన్‌షిప్‌లో బాలలు, ఉప-జూనియర్, జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాల్లో క్యోరూగి, పూమ్సే, జట్టు పూమ్సే,



సమూహ పూమ్సే, వేగవంతమైన కిక్స్, పంచ్‌లు తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి, అమికల్ స్పోర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు వీణ వాహిని, నిర్వాహక మేనేజర్ రాజు రాథోడ్ తెలిపారు. భారత్‌తో పాటు ఫ్రాన్స్, అమెరికా, జర్మనీ, గ్రీస్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఉజ్బెకిస్తాన్, దక్షిణాఫ్రికా, నేపాల్ తదితర దేశాల క్రీడాకారులు, అలాగే దేశంలోని 15కుపైగా రాష్ట్రాల నుంచి పోటీదారులు పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ స్థాయి అనుభవాన్ని కల్పించడమే ఈ ఛాంపియన్‌షిప్ ప్రధాన ఉద్దేశమన్నారు.

పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అందించే ధ్రువపత్రాలకు భవిష్యత్తులో క్రీడా కోటా, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉపయోగపడేలా అధికారిక గుర్తింపు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ ఒలింపిక్ కమిటీతో చర్చలు జరుపుతామని గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి తెలిపారు.

ఛాంపియన్‌షిప్‌కు నమోదు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ మాస్టర్లు, కోచ్‌ల ద్వారా లేదా నిర్వాహక మేనేజర్ రాజు రాథోడ్‌ను 8099444141, 8686357123, 9550301223 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

# నేరేడుమెట్‌లో తెలంగాణ ఉద్యమకారుల నిరాహార దీక్ష

- **ఉద్యమకారుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి**
- **250 గజాల ఇంటి స్థలం, రూ.25 వేల గౌరవ వేతనం, గుర్తింపు కార్డులు ఇవ్వాలి**
- **కె.కె. కమిటీ పేరుతో కాలయాపన చేయొద్దు: టీయూజేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి**

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, ఆగస్టు 17**

తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూజేఏసీ మల్కాజ్‌గిరి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నేరేడుమెట్ చౌరస్తాలో తెలంగాణ ఉద్యమకారులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి 50 మందికి పైగా ఉద్యమకారులు హాజరై తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా టీయూజేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సమస్యలపై కె.కె. కమిటీ ఏర్పాటు



చేసి కాలయాపన చేయడం సరికాదని అన్నారు. కమిటీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

- **ప్రధాన డిమాండ్లు**

తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని, నెలకు రూ.25 వేల గౌరవ వేతనం అందించాలని సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారులకు ప్రభుత్వం తరఫున గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరుల స్మారకార్థం 100 ఎకరాల్లో అమరుల స్మృతి వనం ఏర్పాటు చేయాలని, ఉద్యమ కారులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యమ కారులకు రూ.1 కోటి వరకు రుణ సౌకర్యం కల్పించాలని, అర్హులైన ఉద్యమ కారులకు నామినేటెడ్ పదవులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను ఇకపై వాయిదా వేయకుండా నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించాలని ఆయన సూచించారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమం ఉధృతం తెలంగాణ ఉద్యమ కారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉద్యమకారుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ నిరాహార దీక్షలో బి.ఎన్. జాంబవ్, కొప్పుల కృష్ణ, అలకుంట కృష్ణ, ఎడ్ల వెంకటేష్, పెంటయ్య, పి.ఎస్. శ్రీనివాస్, బి. రేణుక, ఐలయ్య, మోత్కూరి మల్లేష్, అనుముల రవీందర్, కె. శ్యామల, జి. యాదగిరి, ఎస్. రాజయ్య, రాజు గౌడ్, సామ్యేల్, బోయిన రమణ, లావణ్య, విజయలక్ష్మి, శ్రీశైలం, అంకం సతీష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

- **స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు నెలల ఉచిత శిక్షణ**
- **శిక్షణ అనంతరం ధ్రువపత్రంతో పాటు ఉద్యోగ కల్పనలో సహకారం**

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్ ప్రతినిధి గౌరవ్ బీద్కర్, ఆగస్టు 17**

విద్యార్థులు, నిరుద్యోగ యువతలో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్మైల్ ట్విన్ ఈ-లెర్నింగ్ ప్రోగ్రామ్ ద్వారా రెండు నెలలపాటు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పదో తరగతి లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగి, 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువత అర్హులని తెలిపారు. శిక్షణలో కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, ఎంఎస్ వర్డ్, ఎంఎస్ పవర్ పాయింట్,




అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, కృత్రిమ మేధస్సు భావనలు, ట్యాలీ ఈఆర్‌పీ, ప్రాక్టికల్ కంప్యూటర్ శిక్షణ వంటి ఆధునిక అంశాలపై సమగ్ర శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా మాట్లాడే ఆంగ్ల భాష, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, పాత్రధారణ, బృంద కార్యకలాపాలు, వృత్తి మార్గదర్శకత్వం, జీవిత చరిత్ర తయారీ, ఉద్యోగ ఇంటర్వ్యూలకు సన్నద్ధత, నమూనా ఇంటర్వ్యూలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసిన అభ్యర్థులకు ధ్రువపత్రం అందించడంతో పాటు ఉద్యోగ అవకాశాల కల్పనలో సహకారం అందిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఇప్పటికే ఈ కార్యక్రమం ద్వారా సుమారు 500 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాలకు అవసరమైన కంప్యూటర్, ఆంగ్ల భాష, కమ్యూనికేషన్, ఉద్యోగార్హత నైపుణ్యాలను ఉచితంగా నేర్చుకునే ఈ అవకాశాన్ని విద్యార్థులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

సమగ్ర వివరాలు, నమోదు కోసం 70328 60585, 99857 41000 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## బీజేపీలో చేరిన కాంగ్రెస్ సీనియర్ నేతలు, నాయకులు

**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 17**

పరకాల నియోజకవర్గం 15వ డివిజన్ పరిధిలోని గొర్రెకుంట గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. కట్ట మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ గాజు శ్రీనివాస్‌తో పాటు నరేడ్ల శ్రీనివాస్, పెరబోయిన నాగరాజు, కొత్త రాజమౌళి, కోలా సదానందం గౌడ్, కట్కూరి రాజు, రమేష్, సురేష్, సుదమల్ల శ్రీకాంత్, సిలువేరు గోపీచంద్, బైరిపాక అభిలాష్, గోప్ప అజయ్, బైరిపాక సంజయ్, వెంకట రాజు, వెంకటకృష్ణ తదితరులు బీజేపీ కండువా కప్పుకున్నారు. 15వ డివిజన్ అధ్యక్షుడు ల్యాదాల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు నూతన సభ్యులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డా. కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై విశ్వాసంతో, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తూ పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రధాన శివకుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బిల్లా రమేష్, డివిజన్ జనరల్ సెక్రటరీ గుండెబోయిన రంజిత్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ పిల్లలు రవీందర్ గౌడ్, గుల్లపెల్లి గిరిధర్, బూత్ అధ్యక్షులు నరేళ్ల రాములు, జల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కుల గణన లేకుండా జనగణన అసంపూర్ణం

- బీసీలను ఇంకెంతకాలం మోసం చేస్తారు..?
- జనగణనలో బీసీలకు ప్రత్యేక కేటగిరీ కల్పించాలి
- లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తాం
- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు



**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 17**
దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో బీసీ కుల గణనకు ప్రత్యేక కేటగిరీ కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం వెనుకడుగు వేయడం బీసీల పట్ల చేసిన తీవ్రమైన అన్యాయమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు విమర్శించారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా బీసీ సంఘాలు, సామాజిక సంస్థలు చేపట్టిన ఉద్యమాల నేపథ్యంలో జనగణనలో బీసీ కుల గణన నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని వెంకట్రాములు గుర్తు చేశారు. 2025 ఏప్రిల్ 1న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారని, అనంతరం పార్లమెంటు లోనూ రెండో దశ జనగణనలో బీసీ కుల గణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇటీవల విడుదల చేసిన జనగణన గెజిట్ నోటిఫికేషన్‌లోని ప్రశ్నావళిలో ఎస్సీ, ఎస్టీ, ఇతరులు అనే విభాగాలు మాత్రమే ఉండగా, బీసీలకు ప్రత్యేక ప్రస్తావన లేకపోవడం హామీలకు విరుద్ధమని మండిపడ్డారు. ఇది బీసీలను నమ్మించి మోసం చేసిన చర్యగా అభివర్ణించారు. దేశంలో వెనుకబడిన వర్గాల జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులపై శాస్త్రీయ సమాచారం సేకరించినప్పుడే చట్టసభల్లో రిజర్వేషన్లు, విద్య, ఉపాధి, సంక్షేమ పథకాల అమలులో సముచిత న్యాయం జరిగే అవకాశం ఉంటుందని వెంకట్రాములు పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను సవరించి, ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీలకు జనగణన ప్రశ్నావళిలో ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేసి, యూనిక్ కోడ్ కేటాయించి శాస్త్రీయ పద్ధతిలో బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ప్రత్యేక కోటా అమలు చేయాలని, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి వెనుకబడిన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాలు మరింత ఉధృతమైతే అందుకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తాటిపాముల వెంకట్రాములు హెచ్చరించారు.

# జాతీయ స్థాయిలో విశిష్ట సేవా మెడల్‌కు ఎంపికైన అదనపు డీసీపీ నర్సయ్యకు ఘన సన్మానం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 17**
జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన విశిష్ట సేవా మెడల్ (వి ఎస్ ఎం)కు ఎంపికైన సికింద్రాబాద్ జోన్ అదనపు డీసీపీ జే. నర్సయ్యను రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



ఈ సందర్భంగా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజా సంబంధాల అధికారి టి. రాజ్ కుమార్ జే. నర్సయ్యను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగానే ఈ విశిష్ట సేవా మెడల్ లభించిందని ఆయన పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండటం, విధి నిర్వహణలో క్రమశిక్షణతో వ్యవహరించడం వల్లే జే. నర్సయ్యకు ఈ గౌరవం దక్కిందని టి. రాజ్ కుమార్ అన్నారు. భవిష్యత్తులోనూ మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) తెలంగాణ ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొని అదనపు డీసీపీ జే. నర్సయ్యను అభినందించారు.

# కంటోన్మెంట్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపడతాం: ఎంపీ ఈటల రాజేందర్

- ఆర్టీసీ కాలనీ బంజారానగర్‌లో ప్రజావాణి నిర్వహించి స్థానిక సమస్యలపై వినతులు స్వీకరణ





**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 17**
మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆర్టీసీ కాలనీ బంజారానగర్‌లో పర్యటించి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసుల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుని, ప్రజలు అందించిన వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు కాలుష్యరహితమైన, సుందరమైన ప్రాంతంగా పేరొందిన కంటోన్మెంట్ ప్రస్తుతం మురికికూపంగా మారిందని ప్రజల నుంచి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో ఈ అంశాన్ని చర్చించి, సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడున్నర లక్షల జనాభా ఉన్న కంటోన్మెంట్ ప్రాంతానికి సీఈఓతో పాటు పలువురు అధికారులు పనిచేస్తున్నప్పటికీ, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రస్తుత సీఈఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలపై స్పందన లేకపోవడం, పరిష్కారానికి చొరవ చూపకపోవడం విచారకరమని అన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు సీఈఓ దృష్టికి తీసుకెళ్లినా ఆయన వైఖరిలో మార్పు రాలేదని, ఇంత అసమర్థ అధికారిని తాను ఎప్పుడూ చూడలేదని వ్యాఖ్యానించారు. కంటోన్మెంట్‌లో రోడ్ల విస్తరణ కోసం సేకరించిన భూములకు సంబంధించిన పరిహారంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.305 కోట్ల నిధులను కేంద్ర ఖజానాకు కాకుండా కంటోన్మెంట్ బోర్డు ఖాతాలోనే జమ అయ్యేలా తాను ప్రత్యేకంగా కృషి చేశానని తెలిపారు. ఈ నిధులతో దాదాపు 40 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పాత డ్రైనేజీ పైప్‌లైన్ల స్థానంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు, వర్షాకాలంలో తరచూ ముంపునకు గురయ్యే ప్రాంతాలకు శాశ్వత పరిష్కారంగా స్టార్మ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణం చేపడతామని వెల్లడించారు. కంటోన్మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పన్నులు, నిధులు విడుదలయ్యేలా కూడా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధిగా ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయలేనని, తనకు ప్రజలే నిజమైన వీఐపీలని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, తనను నమ్మి ప్రజలు ఓటు వేసి గెలిపించారని, ప్రజలకు సేవ చేయడం తమ బాధ్యత అని అన్నారు. కాలనీవాసులు వినతిపత్రాల ద్వారా ప్రస్తావించిన పోలీసు పెట్రోలింగ్ బలోపేతం, సీసీ కెమెరాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, చౌరస్తాల విస్తరణ, రహదారుల నిర్మాణం, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు వంటి సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు నర్మదా మల్లికార్జున్‌తో పాటు ప్రశాంత్, నరసింహ, మల్లికార్జున్, వై.వి. రావు తదితరులు పాల్గొన్నారు.

# దళిత బస్తీలో సహపంక్తి భోజనంలో పాల్గొన్న ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**కరపత్రం ప్రతినిధి వరంగల్ ఆగస్టు 17**
వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 13వ డివిజన్‌లో జన్ను సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో దళిత బస్తీలో నిర్వహించిన సహపంక్తి భోజన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. సామాజిక సమానత్వం, సోదరభావం, ఐక్యతను చాటేలా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర నాయకులు త్రిలోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరి శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు రఘునా రెడ్డి, మండల అధ్యక్షులు విప్ప సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు, బస్తీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పోలీస్ కమిషనర్‌ను కలిసిన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గం



**కరపత్రం ప్రతినిధి /వరంగల్, ఆగస్టు 17**
వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఇటీవల ఎన్నికైన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు సోమవారం పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్‌ను సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి మొక్కలను అందజేశారు. ఎన్నికల నోడల్ అధికారి, అదనపు డీసీపీ ప్రభాకర్‌రావు నూతన కార్యవర్గ సభ్యులను పోలీస్ కమిషనర్‌కు పరిచయం చేశారు. అధ్యక్షుడిగా కె.కరుణాకర్, ఉపాధ్యక్షులుగా బి.సతీష్, బి.శరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇ.వీరభద్రరావు, సంయుక్త కార్యదర్శిగా టి.నరేష్, కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎస్.ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా బి. నరేష్ ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా ఎం.తులసి, సి.హెచ్.మహేందర్ యాదవ్, ఏ.రమేష్, ఎన్.ప్రవీణ్, ఎం.డి.తాజుద్దీన్, పి.సర్వేశ్ ఉన్నారు. ఈ సందర్భంగా సీపీ ఎన్.శ్వేత నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. పోలీస్ సిబ్బంది సమస్యలపై తక్షణమే స్పందించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పోలీస్ అధికారుల సంఘం సిబ్బందికి అండగా నిలుస్తూ స్ఫూర్తిదాయకంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్నికల నోడల్ అధికారి అదనపు డీసీపీ ప్రభాకర్‌రావు, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు నాగయ్య, సదయ్యతో పాటు నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

- కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్




**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ, ఆగస్టు 17**
దేశ జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న ఇతర వెనుకబడిన వర్గాలకు (ఓబీసీలు) చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ, దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఓబీసీలకు పాలనా వ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. 2027 జనాభా లెక్కల సేకరణ సందర్భంగా కులగణన నిర్వహించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు సోమవారం ఢిల్లీలో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 1931లో బ్రిటిష్ పాలనలో చివరిసారిగా కులగణన నిర్వహించగా, తిరిగి 2027లో ఈ ప్రక్రియ చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. అయితే, 40 అంశాలతో కూడిన ప్రశ్నావళిలో ఓబీసీ వర్గాన్ని తప్పనిసరి అంశంగా చేర్చకుండా ఐచ్ఛికంగా ఉంచడం తీవ్ర అభ్యంతరకరమని విమర్శించారు. ఓబీసీల వాస్తవ జనాభా, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులపై సమగ్ర సమాచారం అందుబాటులోకి వచ్చినప్పుడే రిజర్వేషన్లు, సంక్షేమం, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందని రవిచంద్ర అభిప్రాయపడ్డారు. 2014 జూన్ 14న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అసెంబ్లీలో మహిళలతో పాటు ఓబీసీలకు కూడా చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. చట్టసభల్లో ఓబీసీలకు 33 శాతం, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, అలాగే కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ లోపల, బయట నిరంతరం పోరాటం కొనసాగించిందని, భవిష్యత్తులోనూ అదే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే ఓబీసీలను కూడా ప్రత్యేక కేటగిరీగా గుర్తించి, శాస్త్రీయంగా, పారదర్శకంగా నమోదు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి

- పరకాల పర్యటన ప్రచారానికే పరిమితం.. ప్రజా సమస్యలు గాలికొదిలేశారని విమర్శ
- బీఆర్ఎస్ కార్యకర్తల అరెస్టులను ఖండించిన నాయకులు






**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 17**
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ప్రభుత్వ పనితీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాలకు సమాన న్యాయం చేసే లక్ష్యంతో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. దళిత బంధు ద్వారా దళిత కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో పనిచేశారని, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను ఇప్పుడు ప్రారంభించడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు కనిపించడం లేదని విమర్శించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం బీఆర్ఎస్ ఉద్యమం చేసి సాధించిందని పేర్కొంటూ, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోతే ప్రజలే తగిన తీర్పు ఇస్తారని హెచ్చరించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. పరకాల అభివృద్ధి కోసం స్పష్టమైన కార్యాచరణ లేకుండానే ముఖ్యమంత్రి పర్యటనలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను విమర్శించడం మినహా పరకాల నియోజకవర్గానికి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటైన కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌ను కేంద్ర ప్రభుత్వం సైతం ప్రశంసించిందని గుర్తు చేశారు. రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పరకాలలో ఇప్పటికే నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్‌ను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ప్రచార కార్యక్రమాలకే పరిమితమవుతోందని అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఖండించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బదులుగా ప్రభుత్వ కార్యక్రమాల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని ఇద్దరు నాయకులు మండిపడ్డారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కులగణనలో మున్నూరుకాపులతో పాటు బీసీలందరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి: ఎంపీ రవిచంద్ర



**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 17**
జనాభా లెక్కల సేకరణలో భాగంగా నిర్వహించనున్న కులగణన ప్రక్రియలో మున్నూరుకాపులతో పాటు బీసీలందరూ తప్పనిసరిగా పాల్గొని తమ కుల వివరాలను నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో బ్రిటీష్ పాలన కాలంలో 1931లో చివరిసారిగా కులగణన నిర్వహించారని, అనంతరం సెన్సెస్--2027లో మళ్లీ కులగణన చేపడుతున్నారని తెలిపారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల ఆర్థిక, సామాజిక, విద్యా, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరించేందుకు కులగణన కీలకమని పేర్కొన్నారు. కులగణన ద్వారా బీసీల వాస్తవ జనాభా వివరాలు ప్రభుత్వానికి అందుబాటులోకి వస్తాయని, సంక్షేమ పథకాల రూపకల్పన, అమలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక, రిజర్వేషన్ల అంశంలో ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీ రవిచంద్ర అన్నారు. మున్నూరుకాపులతో పాటు రాష్ట్రంలోని అన్ని బీసీ వర్గాల ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా, వెనుకాడకుండా కులగణన ప్రక్రియలో పాల్గొని తమ కుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని ఎంపీ రవిచంద్ర విజ్ఞప్తి చేశారు.